క్లుప్తంగా

నేత్రవైద్య శిబిరం



వృద్ధురాలికి నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్

బొబ్బిలి: పట్టణంలోని అభ్యుదయ ఉన్నత పాఠశాలలో అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల నుంచి వచ్చిన 174 మందికి ఆప్తాలమిస్ట్ దివ్య నేత్రపరీక్షలు చేశారు. వీరిలో 47 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. నిర్వాహకులు మర్రాపు కూర్మినాయుడు, చింత శారద మాట్లాడుతూ శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి బస్సు ద్వారా తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి, అనంతరం ఇళ్లకు తీసుకువస్తామన్నారు. డాక్టర్ సంధ్య, సాయికుమార్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైల్‌లో తనిఖీలు



సబ్ జైల్‌ను పరిశీలిస్తున్న న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

బొబ్బిలి: పట్టణంలోని సబ్ జైల్‌లో జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణప్రసాద్ ఆదివారం తనిఖీలు చేశారు. వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. అలాగే అక్కడున్న లీగల్‌ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు రిమాండ్ ఖైదీలకు న్యాయ విజ్ఞానంపై అవగాహన కల్పించి, పలుచట్టాలను విశదీకరించారు. సిబ్బంది, తోటి ఖైదీలు వివక్ష ప్రదర్శించకూడదని, దీనికోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను వివరించారు. ఇక్కడి పరిస్థితిని సూపరింటెండెంట్ పాత్రోను అడిగి తెలుసుకున్నారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు న్యాయ సహాయం చేసేందుకు న్యాయవాదిని నియమిస్తామన్నారు.


చోరీ కేసుపై దర్యాప్తు ముమ్మరం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవులు

వంగర: మండలంలోని బాగెంపేట గ్రామంలో పసుమర్తి శంకరరావు ఇంట్లో ఇటీవల చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు ఆదివారం బాగెంపేట వెళ్లి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతూ కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.డీఎస్పీ వెంట రాజాం టౌన్ సీఐ కె.అశోక్ కుమార్, ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపై గోతులు పూడ్చుతున్న యువకులు

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామానికి చెందిన యువత ఎవరో వస్తారు..ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ గ్రామ బీటీ రోడ్డుకు ఆదివారం వారే మరమ్మతులు చేసుకున్నారు. రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా గోతులు తేలడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎంతకూ స్పందించకపోవడంతో విసుగెత్తిపోయి, గ్రామ యువకులే శ్రమదానం చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టారు, క్రషర్ బుగ్గి తీసుకువచ్చి గోతులను పూడ్చారు. యువకులను గ్రామస్తులు అభినందించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



చాడీశ్వరీదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని సంత మార్కెట్‌లో ఉన్న కల్యాణగౌరీ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని చాడీశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 24న ప్రారంభమైన ఉత్సవాలు నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. ముగింపు రోజున అర్చకులు హరవెల్లి హరనాథశర్మ ఆధ్వర్యంలో హోమాలు, విశేష పూజలు చేశారు. అమ్మవారి విగ్రహాన్ని మేలతాళాల మధ్య ఊరేగించారు. కల్యాణ గౌరీదేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు టీకాలతో వ్యాధులకు చెక్

- మూగజీవాలపై సీజనల్ వ్యాధుల ప్రభావం
- బొబ్బిలి నియోజకవర్గంలో పశువులు 73,437
- వర్షాకాలంలో పశువులకు పొంచి ఉన్న ముప్పు
- జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమే



బూసాయవలస రైతు సేవా కేంద్రం వద్ద పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది(ఫైల్)

రామభద్రపురం:

పాడి పశువుల పెంపకానికి బొబ్బిలి నియోజకవర్గం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ వ్యవసాయ అనుబంధ రంగంగా పాడి పరిశ్రమ వాణిజ్యస్థాయిలో విస్తరించింది. రైతులు పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. నియోజక వర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి, తెర్లాం, బాడంగి మండలాల్లో ఆవులు, ఎద్దులు 64,357, గేదెలు 9,080 ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు పశువులు రకరకాల రోగాల బారినపడే ప్రమాదం ఉంది. సీజనల్ వ్యాధులు మనుషులకే కాదు మూగ జీవాలకు సైతం సంక్రమిస్తాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొత్తగా చిగురించే పచ్చిక తినడం వల్ల పశువుల కడుపుల్లో నత్తలు తయారయ్యే పర్మాదం ఉంది. అలాగే కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు విరోచనాల వ్యాధి వస్తుంది. దీంతో పశువులు బక్కచిక్కిపోతాయి.వీటితో పాటు ముద్ద చర్మ వ్యాధి(లంపీ స్కిన్),గొంతువాపు,గాలికుంటు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.వ్యాధుల లక్షణాలను గుర్తించి సరైన చికిత్స అందిస్తే పశువులను కాపాడుకునే అవకాశం ఉంటుంది. పశువులు రోగాల బారిన పడి పాడి రైతులు నష్టపోకుండా ఉండేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేయడం, పశుపోషణలో పాటించాల్సిన జాగ్రత్తలపై పశువైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

ముద్ద చర్మ వ్యాధి(లంపీ స్కిన్):

ఈ వ్యాధి ఆవులు, ఎద్దుల్లో అత్యధికంగా వ్యాపిస్తుంది. ఈ సీజన్‌లోనే ఎక్కువగా సోకుతుంది. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించకపోతే పశువులు ఎక్కువ శాతం చనిపోయే ప్రమాదం ఉంది.వ్యాధి సోకే పశువు శరీరమంతా 2 నుంచి 5 సెంటీమీటర్ల పరిమాణంలో కణితులు ఏర్పడతాయి.గంగడోలం వాపు కనిపిస్తుంది.రెండు నుంచి మూడు రోజుల పాటు జ్వరం ఉంటుంది.పశువు నీరసించి పాల దిగుబడి తగ్గుతుంది. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వ్యాధుల బారిన పడే ప్రమాదం తప్పించవచ్చని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. పశువులను సమీపంలోని పశువైద్యశాలకు తీసుకెళ్లి ముందు గానే టీకాలు వేయించాలి.

జబ్బవాపు వ్యాధి:

ఆరోగ్యంగా ఉండే ఆవు దూడలకు ఈ వ్యాధి సోకే అవకాశాలు ఉంటాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ వ్యాధి సోకుతుందని తొడ, ఆపై ప్రాంతంలో మాంసం కుళ్లిపోయి, వాపు వచ్చి ఆ వాపు దగ్గర కరకర శబ్దం వినిపిస్తుంది. దీనికి సకాలం లో చికిత్స అందకపోతే 12 గంటల నుంచి 48 గంటల్లో ఈ వ్యాధి సోకిన దూడ మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ముందస్తుగానే టీకాలు వేయించడం మేలు.వ్యాధి సోకిన పశువులకు యాంటీబయాటిక్ ఇంజెక్షన్లను మూడు నుంచి అయిదు రోజులు క్రమం తప్ప కుండా వేయించాలి.

గాలికుంటు వ్యాధి

ఈ వ్యాధి సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. నీటిలో నాలుకపై పళ్ల చిగుళ్లపై నీటి కురు పులు ఏర్పడి చితికిపోవడంతో ఆ పశువులు మేత తినడం మానేస్తాయి. నోటి నుంచి నురగ కారుతుంది. నడవటానికి ఇబ్బంది పడతాయి. వ్యాధి సోకకముందే ముందస్తుగా టీకాలు వేయిడం ఉత్తమం. వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి, పునరుత్పత్తి సామర్థ్యం బాగా తగ్గిపోతాయి. ఈ పశువులకు యాంటీబయాటిక్స్, విటమిన్ ఇంజెక్షన్‌లు, నొప్పి నివారణ, సూది మందులు వేయించాలి.

గొంతు వాపు వ్యాధి:

ఈ వ్యాధి సోకిన పశువులు ఎక్కువ శాతం మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. వ్యాధి సోకిన పశువులకు అత్యధిక శరీర ఉష్ణోగ్రత వల్ల కంటి నుంచి నీరు కారడం, ఎర్రబడి పోవడం, నోటి నుంచి చొంగ కారడం, గొంతు, మెడపై వాపు రావడం, శ్వాస కష్టంగా మారడం వంటివి జరుగుతాయి. సకాలంలో వైద్యం అందించకపోతే మృతి చెందే అవకాశాలు ఉన్నాయి. దీనికి ముందస్తుగా తొలకరిలో టీకాలు వేయించాలి.ఒక వేళ వ్యాధి సోకితే పశువులకు యాంటీ బయోటిక్స్ నొప్పి నివారణకు సూది మందులు,శ్వాస తీసుకోవడానికి స్టెరాయిడ్ ఇంజెక్షన్‌లు చేయించాలి.

అందుబాటులో టీకాలు



పశువులు వ్యాధుల బారిన పడకుండా వేసేందుకు అవసరమైన టీకాలు అందుబాటులో ఉన్నాయి. వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఈసీజన్‌లో పాడి పశువులకు లంపిస్కిన్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఈవ్యాధి పశువులకు ప్రాణాంతకమైనది.వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేసి పశువైద్యుని సూచన మేరకు చికిత్స అందించాలి.ఈగలు,దోమలు ఇతర కీటకాలు వృద్ధి చెందకుండా చూడాలి.ఆరోగ్యంగా ఉన్న పశువులకు లంపిస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.పశువుల ఆరోగ్యంపై ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే దగ్గరలోని పశువైద్యశాలకు తీసుకువచ్చి వైద్యం చేయించాలి.

– ఎల్ విష్ణు, పశుసంవర్ధక శాఖ ఏడీ బొబ్బిలి శాఖ



వ్యాక్సినేషన్‌పై వెటర్నరీ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న రామభద్రపురం పశువైద్యాధికారి అప్పలనాయుడు

సామాజిక స్పృహతో వ్యవహరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్ర

రాజాం: నవ సమాజ నిర్మాణంలో విలేకరుల పాత్ర చాలా గొప్పదని, ప్రతీ పాత్రికేయుడు సామాజిక స్పృహతో బాధ్యతగా మెలగాలని రాజాం జీఎంఆర్ కేర్ ఎండీ డాక్టర్ డి.రాజేంద్ర అన్నారు. రాజాంలోని తృప్తి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన రాజాం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజాం ప్రాంతానికి రాష్ట్రంలో మంచి పేరు, గుర్తింపు ఉందని, ఈ ఖ్యాతిని పత్రికల ద్వారా మరింతగా బయట సమాజానికి తెలియజేసి, ప్రతీ ఒక్క అంశాన్ని మంచి వైఖరితో గుర్తించి, బాధితులకు న్యాయం చేసేలా ఉండాలని కోరారు. అనంతరం పద్మశ్రీ యడ్ల గోపాలరావు సమాజంలో పత్రికల ఆవశ్యకత, విలేకరుల ప్రాధాన్యత వివరించారు. రాజాం పట్టణ సీఐ కె.అశోక్ కుమార్ విలేకరుల బాధ్యతను గుర్తు చేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పెంకి వెంకటరావును, కార్యదర్శి కరణం సురేష్‌కుమార్, ట్రెజరర్ గణేష్‌తో పాటు కార్యవర్గాన్ని సత్కరించి, మెమెంటోలు అందించారు. రాజాం సప్తగిరి టెక్నో టైప్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు గుంటముక్కల సప్తగిరి, సీనియర్ విలేకరులు శర్మ, శశిభూషణరావు, నాగేంద్ర, కల్లేపల్లి శ్రీనివాసరావు, శేఖర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారత సమాజానికి దిక్సూచి గుర్రం జాషువా



మాట్లాడుతున్న కవి గౌరునాయుడు

బొబ్బిలి: భారత దేశ సమాజానికి దిక్సూచి వంటి మహాకవి గుర్రం జాషువా అని ప్రముఖ ఉత్తరాంధ్ర కథా రచయిత, కవి గంటేడ గౌరినాయుడు అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఎస్ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో పద్మభూషణ్ గుర్రం జాషువా వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. బొద్దాన అప్పారావు అధ్యక్షతన జరిగిన సాహిత్య సభలో ముందుగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అతిథి గౌరునాయుడు మాట్లాడుతూ పెద్ద కవులంతా నాయకులు, పెద్దలను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్న కాలంలో జాషువా మాత్రమే సమాజాన్ని, బడుగు బలహీన వర్గాలను తన అభ్యుదయ రచనలతో నిలబెట్టేందుకు పోరాడారన్నారు. గొప్ప గొ ప్ప కవులున్న కాలంలో తన రచనలతో అణ గారిన వర్గాలకు జీవమయ్యారన్నారు. గౌరునాయుడుతో పాటు పలువురు సాహితీవేత్తలు, సాహితీ అభిమానులను అంబేడ్కర్ సాహిత్య పీఠం ఘనంగా సత్కరించింది. గజపతినగరం సబ్‌రిజిస్ట్రార్ తవిటయ్య,సత్యవతి, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కొలు చిరంజీవులు, ఎన్‌జీఓ సీఈఓ బలగ రాధ, రిటైర్డ్ ఎస్ఐ సత్యనారాయణ, ప్రముఖ న్యాయవాది ఎస్.జె.విల్సన్ బాబా,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాల పండగ



రామభద్రపురం మండల కేంద్రంలో దేశమ్మ తల్లి వారాల పండగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులంతా తీన్‌మార్ వాయిద్యాల మధ్య గ్రామపొలిమేరలో ఉన్న అమ్మ వారి గద్దె వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు.అమ్మవారికి పరమాన్నం, చీరలు, పసుపు,కుంకుమ సమ ర్పించి, కోళ్ల చూపుతూ మొక్కులు చెల్లించుకున్నారు. – రామభద్రపురం

మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా ప్రకృతిని ప్రేమించిన వారమవుతామని బొబ్బిలి పట్టణానికి చెందిన గాంధీ స్మారకనిధి ప్రతి నిధులు మింది విజయమోహన్, కృష్ణదాస్ అన్నారు. బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామంలో ఆదివారం వారు పర్యటించి పెద్దలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. త్వరలో జరగబోయే వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణానికి హానిచేయని మట్టి విగ్రహాలనే పూజించాలని సూచించారు. ఏటా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయించి వినాయక చవితి ఉత్సవాలకు ఉచితంగా పంచిపెడుతున్నామని చెప్పారు. ఈ ఏడాది కూడా బొబ్బిలిలో విగ్రహాలను తయారు చేయించామని, సోమవారం నుంచి వీటిని పంపిణీ చేస్తామని, కావాల్సిన వారు తమను సంప్రదించాలని సూచించారు. – బొబ్బిలిరూరల్

ఎక్కడి చెత్త అక్కడే..



బాడంగి మండల కేంద్రంలో ఎక్కడికక్కడే చెత్తా చెదారం దర్శనమిస్తోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ) లేకపోవడంతో గ్రామంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను క్లాప్ మిత్రలు గ్రామశివారులో తమకు నచ్చినచోట పారబోసేస్తున్నారు. ప్రధానంగా సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) వెనుక, ప్రభుత్వ వసతి గృహభవనాలకు సమీపంలో పారబోసిన చెత్త కుప్పలుగా పేరుకుపోయింది.ఈ వ్యర్థాలు వర్షాలకు కుళ్లడంతో దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో సమీపంలోని ఆస్పత్రిలో రోగులు, హాస్టళ్లలోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.దోమల కారణంగా విద్యార్థులు రోగాల బారినపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మించేలా చూడాలని మండల కేంద్రానికి చెందిన ప్రజలు కోరుతున్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మించే వరకు చెత్తను డంపింగ్ చేసేందుకు గ్రామ శివారులో స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు. – బాడంగి

కూటమి పాలనలో ఇంటింటికీ మోసం

- 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు హారతులిస్తూ మహిళల ఆదరణ



బొబ్బిలి పట్టణంలోని ఏడో వార్డులో చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్ల పాటూ పార్టీలకతీతంగా ఇంటింటికీ సంక్షేమం అందిస్తే.. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఇంటింటికీ మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ఏడో వార్డులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లిన మాజీ ఎమ్మెల్యే శంబంగి, వైఎస్సార్ సీపీ నాయకులకు మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు, యువతతో శంబంగి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్న నవరత్నాలతో పాటు సూపర్‌సిక్స్, ఇతర పథకాలనూ అమలు చేస్తామని గద్దె నెక్కిన కూటమి నాయకులు ఏడాది పాలనలో హామీలు ఏమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. దీనిపై మహిళలు స్పందిస్తూ ఎన్నో పథకాలు ఇస్తామని చంద్రబాబు చెప్పాడని, కానీ మాకు ఏ పథకాలూ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో భాగంగా రెండో సిలెండర్‌కు డబ్బులివ్వలేదని చాలా మంది చెప్పారు. అలాగే ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామన్న నాయకులు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదన్నారు. అనంతరం శంబంగి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. చివరికి ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేస్తూ, వివిధ కేసులు పెడుతూ అరెస్టు చేయడం లేదా జైళ్లలో పెట్టడం చేస్తున్నారన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకులకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజలను కూటమి ప్రభుత్వం తమ ఎల్లోమీడియా ద్వారా ఏమార్చుతోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఇటీవలే విశాఖ లో రెండు రియల్ ఎస్టేట్ సంస్థలకు 60 ఎకరాల భూములను కట్టబెట్టి వేల కోట్ల దందా మొదలు పెట్టారని ఆరోపించారు. ప్రజలకు సంక్షేమ పథకా లు అందించడం కంటే ఇటువంటి కేటాయింపుల కోసమే పాలన సాగిస్తున్నట్టు అవగతమవుతోందని, ప్రజలు ఈవిషయాన్ని గమనించా లన్నారు. జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అప్పులు చేసి పథకాలు అమలు చేస్తున్నారని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు ఆయన చేస్తున్నదేంటో ప్రజలంతా అర్థం చేసుకోవాలన్నారు. తొలి ఏడాదిలోనే లక్ష కోట్లకుపైగా అప్పులు చేశారని, ఆడబ్బులతో ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారో, ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోను, చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్.వి.మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, పార్టీ అనుబంధ సంఘాల జిల్లా కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గొలగాని రమాదేవి, ఏడో వార్డు ఇన్‌చార్జి బూరి బుజ్జిప్రసాద్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



వంగరలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ చంద్రరావు

వంగర: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై చర్యలు తప్పవని రాజాం వ్యవసాయ సహాయ సంచాలకులు కె.చంద్రరావు హెచ్చరించారు. వంగర, అరసాడ గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఆదివారం ఆయన తనిఖీలు చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడు తూ రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని చెప్పారు.మండలానికి అయిదురోజుల్లో యూరియా, డీఏపీ వస్తుంద న్నారు. యూరియా, డీఏపీలకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీలను వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఆయన వెంట ఏఓ తట్టికోట కన్నబాబు ఉన్నారు.

కృత్రిమ కొరత సృష్టించొద్దు...

బొబ్బిలిరూరల్: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే దుకాణాల నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని, లైసెన్స్‌లను రద్దు చేస్తామని బొబ్బిలి వ్యవసాయ శాఖ ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ హెచ్చరించారు. బొబ్బిలి పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో ఆదివారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, దుకాణాల నిర్వాహకులకు పలుసూచనలు చేశారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం



రాజాం సిటీ: అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు



బొబ్బిలి: కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న జె.సి.రాజు

రాజాం సిటీ: మిస్సైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడని మానవతా సంస్థ అధ్యక్షుడు బి.వి.అచ్యుత్ కుమార్ అన్నారు. మానవతా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి సంస్థ సభ్యులు పూలమాలలువేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా అచ్యుత్‌కుమార్ మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక రంగాల్లో భారత దేశానికి ప్రపంచంలోనే మంచి గుర్తింపు తీసుకువచ్చిన అబ్దుల్ కలాంను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మానవతా సంస్థ సభ్యులు మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు, బొమ్మిడాల కృష్ణారావు, శాసపు సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్, ఆర్.ఈ.సీ హెచ్.జయదేవ్, దామెర రాజా, సీమకుర్తి ప్రసాద్, బాలమురళీ, వాసు, భాస్కరరావు, లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

కలాం ఆశయ సాధనకు కృషి

తెర్లాం: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి విద్యార్థులు, పాఠకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కలాం ఆశయ సాధనకు యువత, విద్యార్థులు కృషి చేయాలని లైబ్రేరియన్ అన్నారు.



తెర్లాం గ్రంథాలయంలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

బొబ్బిలి: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశ ప్రజలకు, యువతకు స్ఫూర్తి ప్రదాత అని కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.సి.రాజు అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం సంస్థ కార్యాలయంలో సభ నిర్వహించారు. ముందుగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కారుణ్య ఫౌండేషన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సభ్యులు శ్రీహరి, శివకాంత్, రామకృష్ణ,ఆర్.ఎస్.రాజు, న్యాయవాది జయప్రకాష్, నితీష్, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

బాడంగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్‌లో పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవర ణలో సీఐటీయూ మండల మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాటా లతో సాధించుకున్న ఎనిమిది గంటలపని విధానాన్ని రద్దుచేసి పది గంటలు చేయాలన్న నిబంధనను ప్రభుత్వం తీసుకురావడం చట్టవిరుద్ధమన్నారు. మహిళా కార్మికులను పరిశ్రమల్లో రాత్రిపూట విధులకు వెళ్లాలని చెప్పడం తీవ్ర అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికచట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. అనంతరం సీఐటీయూ మండలనూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.మండల కన్వీనర్‌గా ఏ.సురేష్, కో–కన్వీనర్లుగా సీహెచ్.రమణమ్మ, శశికల, కె.సింహాచలం, ఇతర కార్యవర్గ సభ్యులుగా సీత, శ్రీదేవి,నాగమణి, ఆదిలక్ష్మి, కళావతి, రామారావు, అప్పన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.